క్లుప్తంగా

వంకలో దిగి పశువుల కాపరి మృతి



నీటిలో మునిగి మృతి చెందిన ముస్తఫా

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం రోటరీ సమీపంలోని వంకలో దిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి నియోజకవర్గం పట్నం గ్రామానికి చెందిన ముస్తఫా(68) రెండేళ్ల నుంచి పులివెందుల పట్టణంలోని సుబ్రహ్మణ్యం దగ్గర పశువులు మేపుకుంటుండేవాడు. రోజు మాదిరిగానే శనివారం పశువులను మేపుకునేందుకు రోటరీపురం సమీపంలోకి వెళ్లాడు. అక్కడ పశువులు వంకలోకి దిగాయని ముస్తఫా కూడా దిగాడు. అతనికి ఈత రాక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువకునిపై దాడి

మనస్తాపంతో ఆత్మహత్య



గురుడు (ఫైల్)

లింగాల : లింగాల మండలం రామన్నూతనపల్లె గ్రామంలో లోమడ గురుడు(18) అనే యువకునిపై గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన రాత్రి కొందరు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని యువకుని తండ్రి లోమడ సూరుడు తెలిపారు. గురుడు గ్రామంలోని ఒక యువతిని ప్రేమిస్తున్నాడని, ఇది గమనించిన యువతి కుటుంబ సభ్యులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి గురుడుకు ఫోన్ చేసి ఇంటి వద్దకు పిలిపించారు. ప్రసాద్, గణేష్, సదా నిరంజన్, ప్రభుదేవా అనే వ్యక్తులు ఇతనిపై దాడి చేశారు. తమ కుమారుడు అలాంటి వాడు కాదని, ఏ ఉద్దేశంతో దాడి చేశారో తెలియదని యువకుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

వైవీయూ సిగలో మరో మకుటం

- ఐఎస్ఓ సర్టిఫికెట్‌లు ప్రదానం
- నాణ్యమైన విద్య, పర్యావరణం, వనరుల వినియోగం, లింగ సమానత్వ చైతన్యంలో గుర్తింపు



సర్టిఫికెట్‌లను అందుకుంటున్న వైవీయూ అధికారులు, అధ్యాపకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐ.ఎస్.ఓ) ధ్రువీకరణ పత్రాలు లభించాయి. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్య అందిస్తున్నందుకు

ఐ.ఎస్.ఒ 21001: 2018 సర్టిఫికెట్, ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేస్తున్నందుకు ఐ.ఎస్.ఒ 14001: 2015 సర్టిఫికెట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ నిర్వహణకు ఐ.ఎస్.ఓ 50001: 2018 సర్టిఫికెట్‌లు అందజేశారు. అదే విధంగా జెండర్ సెన్సిటైజేషన్ సర్టిఫికేషన్, గ్రీన్ అవార్డును హైదరాబాద్ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫికెట్లను విడుదల చేసింది. ఆ సంస్థ సీఈఓ ఆలపాటి శివయ్య శనివారం విశ్వవిద్యాలయలో ఈ మేరకు అధికారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు విద్యాలయంలోని అన్ని విభాగాలను ఆడిట్ చేసి సర్టిఫికెట్ జారీ చేశామన్నారు. నాణ్యత ప్రమాణాలలో, పరిసరాల పరిరక్షణ, ఎనర్జీ మేనేజ్‌మెంట్, ప్రత్యేకించి వేస్ట్ మేనేజ్‌మెంట్, జెండర్ సెన్సిటైజేషన్‌లలో ఆదర్శనీయంగా విశ్వవిద్యాలయం ఉందన్నారు. ఇలాంటి సంస్థకు సర్టిఫికెట్ జారీ చేయడం సంతోషంగా ఉందని, ఇదే పంథాలో మరింత ప్రభావవంతంగా పని చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తూ ఇటీవలే ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకున్నామని తెలిపారు. జాతీయ విద్యా విధానం అమలు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ వందలోపు పొందామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 6 కోట్ల ప్రాజెక్టులను పొందామని, అలానే విశ్వవిద్యాలయం 52 రీసెర్చ్ స్కీములకు రూ. 3.49 కోట్లు కేటాయించిందన్నారు. ప్రఖ్యాత సంస్థలతో ఎంఓయు, విద్యార్థులకు బంగారు పతకాలు ఏర్పాటు చేశామన్నారు. దూరవిద్య ద్వారా విద్యను దగ్గరకు తీసుకువచ్చామని తెలిపారు. త్వరలోనే సీపీ బ్రౌన్ లైబ్రరీ నూతన భవన నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో బీకాం ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ సంస్థ గుర్తింపు లభించడం అధ్యాపకుల పరిశోధన, శ్రమ ఫలాలేనన్నారు. వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో శిక్షణలో ఇవ్వడం ద్వారా ఉద్యోగాలను సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. ఏఐసీటీఈ ఐడియల్ ల్యాబ్‌ను త్వరలో పొందనున్నామని, రూ. 55 లక్షల నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ విశ్వవిద్యాలయ ప్రగతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య కె. రఘుబాబు, సీఈ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ఆచార్య పి.చంద్ర ఓబులరెడ్డి, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, పీఎం ఉషా డైరెక్టర్ డాక్టర్ టి. చంద్రశేఖర్, ఐక్యూఏసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుభోష్ చంద్ర, సభ్యులు డాక్టర్ దాక్షాయణి, డాక్టర్ రియాజున్నీసా, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, ఉమెన్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. రమాదేవి, సభ్యులు ఆచార్య కాత్యాయని, ప్రమీలామార్గరేట్, అనుప్రసన్న, వేణి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి తిలోదకాలిస్తున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకానికి తిలోదకాలిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొత్తం మూడు వేల జబ్బులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకు రావడం ద్వారా ఆ పథకాన్ని మరింత పటిష్టం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పథకాన్ని నీరుగార్చేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నారా లోకేష్‌కు సన్నిహితులైన ఒక ప్రైవేటు బీమా కంపెనీకి అప్పగించడం ద్వారా ముడుపులు తీసుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. వైఎస్ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకంతో చంద్రబాబు వ్యాపారం నడుపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాల పరిమితి ముగిసిన 108 వాహనాలను తొలగించి 1080 కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ప్రజలకు నష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్ షఫీ, త్యాగరాజు, కిరణ్, అఖిల్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీ పాల్గొన్నారు.

రెట్టించిన ఉత్సాహంతో సేవలందించాలి

కడప కల్చరల్ : ఇంతవరకు పార్టీకి అందించిన సేవలను గుర్తించి కార్యకర్తలకు కీలక పదవులు ఇచ్చారని, రెట్టించిన ఉత్సాహంతో సేవలు అందించాల్సిన అవసరం ఉందని నాయకులు, కార్యకర్తలు, ఆయా విభాగాల ప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో పలువురు కార్యకర్తల సేవలను గుర్తించి వారికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ నియామకాలు చేపట్టామన్నారు. బాధ్యతలు స్వీకరించిన కార్యకర్తలంతా చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

ఇ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయ సభా భవనంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తమ పరిధిలో ఏ ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయి? ఎంత మంది రైతులకు ఇ-పంట నమోదు చేశారు? ఇ-కేవైసీ ఎంత మంది చేయించుకున్నారు? తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఇప్పటికీ ఇ-పంట నమోదు చేసుకోని వారు ఉంటే తక్షణం చేయాలని పేర్కొన్నారు. అలాగే కేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటలను ప్రొక్యూర్మెంట్ కొరకు సీఎం యాప్ నందు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో యూరియాను అందుబాటులో ఉంచడానికి ఇండెంట్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు సరస్వతి, శ్యాం బాబు, శ్రీకాంత్ రెడ్డి, జ్యోతి, డివిజన్ పరిధిలోని ఎంపీఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

కలమల్ల పోలీస్ స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరావు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల పోలీస్‌స్టేషన్‌ను శనివారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే విచారించి, పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలమల్ల ఎస్ఐ తిమోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

జమ్మలమడుగు: డిప్యూటీ డీఎంహెచ్ఓ నుంచి కర్నూల్ డీఎంహెచ్ఓగా పదోన్నతి పొందిన డాక్టర్ శాంతకళ వైద్యులు సన్మానించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి, హుస్సేన్ మాట్లాడుతూ విధులను నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహించిన డాక్టర్ శాంతికళను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీషా

వేంపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా పేర్కొన్నారు. శనివారం చక్రాయపేట మండలంలోని గంగారపువాండ్లపల్లె గ్రామంలో లక్కిరెడ్డిపల్లె మండలం లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రతి చిన్న సమస్యకు ఘర్షణలకు పాల్పడి కేసులు పెట్టుకోకుండా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ప్రతినిత్యం చట్టాలతో ప్రతి పౌరుడు జీవించాల్సి ఉంటుందని, పేద ప్రజలకు ఉచిత న్యాయ సహాయం చేస్తామన్నారు. దివ్యాంగులకు, మతిస్థిమితం లేనివారికి కూడా ఉచిత న్యాయ సహాయం చేస్తామని పేర్కొన్నారు. పౌరులు చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన కేసులు నమోదవుతాయని, సివిల్, క్రిమినల్ కేసులలో రాజీయే రాజమార్గమని చెప్పారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ కుమారి, ఏఎస్ఐ నాగరాజు, అడ్వకేట్ చెన్న కృష్ణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

పులివెందుల టౌన్ : గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ మాధవ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో పులివెందు ఫుడ్ అండ్ సైన్స్, టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ నాల్గవ సంవత్సర విద్యార్థులు స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపు వారం రోజులపాటు జరుగుతుందని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్తులతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం తమ వంతుగా ప్రయత్నిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి, వ్యవసాయ కళాశాల ఆసోసియేట్ డీన్ కిశోర్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం జిల్లా అధికారి జయమ్మ, హెడ్మాస్టర్ మార్తమ్మ, సేవా సమితి అధ్యక్షుడు రాజు, అధ్యాపకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



కమలాపురం.. వ్యాపారాభివృద్ధిలో ఘనం



కమలాపురంలో ఏర్పాటు చేసిన భారత్ ఏజెన్సీస్



కొత్త హంగులతో ఏర్పాటు చేసిన ధన్వంతరి బేకరి

కమలాపురం: కమలాపురం నియోజకవర్గ కేంద్రమైనప్పటికి గతంలో ఎలాంటి వసతులు ఉండేవి కాదు.. ఏ వస్తువు కొనాలన్నా అటు కడపకు గాని, ఇటు ప్రొద్దుటూరుకు గాని వెళ్లాల్సి వచ్చేది. 10-15 ఏళ్ల క్రితం వరకు ఇవే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అవసరమైన ఎలక్ట్రిక్ వస్తువులు, పెయింట్లు, ప్లంబర్స్ మెటీరియల్, శానిటరీ వస్తువులు, చివరకు గ్రానైట్‌తో సహా కమలాపురంలోనే దొరుకుతున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డులో మహ్మద్ సాదిక్, చక్రపాణి భారత్ ఏజెన్సీస్ ఏర్పాటు చేసి గృహ నిర్మాణానికి కావలసిన వస్తువులన్నీ సరసమైన ధరలకే విక్రయిస్తున్నారు. రైతుల పొలాలకు నీరు అందించే పైపులు, మోటార్లు సైతం ఇక్కడే లభిస్తున్నాయి.

కేజీ నుంచి పీజీ దాకా..: కమలాపురం పట్టణంలో కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థలు ఉన్నాయి. గతంలో కేవలం పాఠశాలలతో పాటు ఇంటర్మీడియట్‌కు చెందిన ఒక ఎయిడెడ్ కాలేజి మాత్రమే ఉండేది. విద్యా వంతుడు రాజగోపాల్‌రెడ్డి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నామ మాత్రపు ఫీజుతో అన్ని రకాల విద్య అందించాలనుకుని డిగ్రీ, పీజీ, బీ.ఈడీ., తో పాటు అన్ని రకాల డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి 20 ఏళ్లుగా హైస్కూల్‌ను నడుపుతున్నారు. అలాగే చిన్నారుల కోసం ప్రవీణ్ అప్పాజీ ఏర్పాటు చేసిన వెన్నెల ప్లే స్కూల్ చిన్న పిల్లల పట్ల కేర్ తీసుకుంటుడటంతో మంచి పేరు ప్రతిష్టతలకు కేరాఫ్‌గా నిలిచింది. అలాగే పాలిటెక్నిక్ కళాశాల కూడా కమలాపురంలో ఉంది.

పసందైన కేకుల తయారీ

కమలాపురం పట్టణంలో అత్యాధునిక డిజైన్లలో బేకరీలు వెలిశాయి. రకరకాల కేకులు తయారు చేస్తూ వినియోగదారుల మనుసు దోచుతున్నారు బేకరీ వ్యాపారులు. క్రిస్మస్, న్యూ ఇయర్‌తో పాటు ప్రతి పండుగలు, బర్త్‌డేలకు బేకరిలకు వెళ్లి కేకులు ఆర్డర్ చేయడం ప్రజలకు అలవాటుగా మారింది.

అందుబాటులో ఎలక్ట్రానిక్స్ షాపులు: మిక్సీ, గ్రైండర్ మొదలుకొని టీవీ, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, ఐరన్ బాక్స్‌లు తదితరవి కొనాలంటే తప్పని సరిగా పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిందే. అలాంది ప్రస్తుతం శాంసంగ్ తదితర కంపెనీల షోరూంలే కమలాపురంలో వెలిశాయి.

ద్విచక్ర, ఈవీ షోరూంలు

కమలాపురంలో హీరో, టీవీఎస్, హోండా, బజాజ్ తదితర కంపెనీల బైక్ షోరూంలతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల షోరూంలు సైతం కమలాపురం పట్టణంలోనే వెలిసాయి. గతంలో చిన్న చిన్న మోపెడ్స్ కొనాలన్నా కడప, ప్రొద్దుటూరుకు వెళ్లేవారు ఇక్కడి ప్రజలు. ప్రస్తుతం అన్ని రకాల బైక్ షోరూంలతో పాటు ఎలక్ట్రిక్ బైక్‌ల షోరూంలు సైతం వెలిసాయి.

పిల్లలకు సమతుల్య ఆహారం అందించాలి

వేంపల్లె : పిల్లలకు సమతుల్య ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత అన్నారు. శనివారం స్థానిక శ్రీరాంనగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో ఇసీసీఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు 6 ఏళ్ల వయస్సు వచ్చే వరకు మెదడు 85 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. కాబట్టి పిల్లలకు పౌష్టికాహారమివ్వాలని కోరారు. గర్భిణులు కూడ ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రక్తహీనతను నివారించేందుకు ఆకు కూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.



సభను జయప్రదం చేయండి

పులివెందుల టౌన్ : విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి కోరారు. శంఖారావం సభకు పులివెందుల నుంచి హిందువులు భారీగా సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. స్థానిక పార్నపల్లె రోడ్డులో ఉన్న సరస్వతి విద్యా మందిరం పాఠశాల నుంచి బస్సులలో ఎర్రగుంట్లకు చేరి అక్కడ నుంచి స్పెషల్ ట్రైన్ ద్వారా విజయవాడకు చేరుకుంటారు. సభకు వెళ్లే బస్సులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

సింహాద్రిపురం : విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావ సభకు సింహాద్రిపురం మండలం నుంచి హిందువులు బయలుదేరి వెళ్లారు. శనివారం సింహాద్రిపురంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో వారు పూజలు నిర్వహించారు. అనంతరం సభకు వెళ్లే వాహనాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.శశిభూషణ్‌రెడ్డి, భానుకోట క్షేత్ర అర్చకుడు శివయ్యస్వామిలు జెండా ఊపి ప్రారంభించారు.

ఎర్రగుంట్ల నుంచి..

ఎర్రగుంట్ల : విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు యర్రగుంట్ల నుంచి భారీగా హిందూవులు బయలుదేరారు. హిందువుల సంయుక్తంగా ఉండి హిందుత్వంను వృద్ధి చేయాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో యర్రగుంట్ల మండలంలోని హిందూవులు పెద్ద సంఖ్యలో హైందవ శంఖారావం సభకు బయలు దేరారు.













క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్

జమ్మలమడుగు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీజీబీ మార్కెట్‌శాఖ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థునులు బాగా చదువుకుంటే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. శనివారం పట్టణంలోని బాలకల ఉన్నత పాఠశాలలో ఉన్న ఎస్సీ ఎస్టీలకు చెందిన జీరో అకౌంట్‌ను ప్రారంభించి వారి పేరు మీద ఐదువేల రూపాయలు వేసి వారికి అకౌంట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఇప్పటి నుంచి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేదవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న హెడ్మాస్టర్

వేంపల్లె : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభను కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ తెలిపారు. డిసెంబర్ 22, 23 తేదీలలో విజయవాడ కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గర్విత తివారి అండర్ -17 విభాగంలో 47 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



ఈశ్వర్ రెడ్డి



చంద్రశేఖర్



శశికాంత్‌రెడ్డి



కోళ్ల భాస్కర్



నిరంజన్‌రెడ్డి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని జిల్లా వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ బి.ఈశ్వర్ రెడ్డి చెప్పారు. వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీగా చక్రాయపేట మండలానికి చెందిన బి.ఈశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా నియమించినందుకు వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రశేఖర్

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కటిక చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గ జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడుగా శశికాంత్‌రెడ్డి

తొండూరు : పులివెందుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడుగా డి.వి.శశికాంత్‌రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ ఉపాధ్యక్షుడుగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి

జమ్మలమడుగు రూరల్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నారపురెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఆ పార్టీ అధిష్టానం మోహన్‌రెడ్డిని నియమించింది. శనివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు పాటిస్తూ ముందుకు వెళతానని తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డిని జిల్లా మున్సిపాలిటీ విభాగం అధ్యక్షుడు హృషికేశవరెడ్డి సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కోళ్ల భాస్కర్

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పులివెందులకు చెందిన కోళ్ల భాస్కర్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా కోళ్ల భాస్కర్ మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి వైఎస్ కుటుంబానికి, వైఎస్సార్‌సీపీని నమ్ముకుని, పార్టీ కార్యకర్తగా విశ్వాసంతో ఉంటున్న తనకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమించడం ఆనందంగా ఉందన్నారు.తనకు పదవి రావడానికి సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, సతీష్ రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలకు ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా నిరంజన్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు): వైఎస్సార్‌సీపీ కడప జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా యర్రసాని నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. దీంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామానుజుల రెడ్డికి నిరంజన్‌రెడ్డి కతజ్ఞతలు తెలిపారు.



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న హృషికేశవరెడ్డి

ఈ-నామ్ అమలుకు అంగీకారం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ కాయల క్రయ, విక్రయాల్లో ఈ-నామ్ అమలుకు అంగీకారం తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్, వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు శ్రీమతి విజయ సునీతల ఆదేశాల మేరకు పులివెందులలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం మార్కెటింగ్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు అధ్యక్షతన ఈ-నామ్ అమలుపై చీనీ కాయల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-నామ్ అమలు చేయడం వలన వ్యాపారంలో పారదర్శకత ఉంటుందని, రైతుల చీనీ దిగుబడులకు మంచి ధర లభిస్తుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి పులివెందుల మార్కెట్ యార్డులో చీనీకాయల క్రయ, విక్రయాల్లో ఈ-నామ్ అమలు చేయనున్నామని, అందుకు సంబంధించిన సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

హౌస్ హోల్డ్ సర్వే పర్యవేక్షణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేట పంచాయతీలో జరుగుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగ్గింగ్, పీఏసీఎస్ సర్వే, ఎన్సీఏ సర్వేలను శనివారం ఎంపీడీఓ కుల్లాయిబాబు ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాపాసాహెబ్‌పేట సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, శాఖాపరమైన సూచనలు జారీ చేశారు.

ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో శనివారం పులివెందుల పట్టణంలోని వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదవాలి

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి శనివారం ప్రారంభించి విద్యార్థులకు అన్నం వడ్డించారు.

- చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రహమతుల్లా ఆధ్వర్యంలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ రాజశేఖరరెడ్డి, తహసీల్దార్ విజయకుమారిలు ప్రారంభించారు.

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం ప్రభుత్వ (వైఎస్‌ఆర్‌ఆర్) జూనియర్ కళాశాలలో శనివారం ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ నాగేశ్వరరావులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు.

జమ్మలమడుగు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని బాలికల జూనియర్ కాలేజీలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ప్రారంభించగా, బాలుర జూనియర్ కాలేజీలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నిసాలు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ప్రారంభించారు.

సర్వసభ్య సమావేశం రసాభాస



మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్

వల్లూరు (చెన్నూరు) : బయటి వ్యక్తులు ప్రవేశంతో సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చ జరిగే సమయంలో కొందరు బయట వ్యక్తులు ప్రవేశించి సభ్యులతోపాటు సమావేశంలో కూర్చోవడంతో పాటు తమ వ్యక్తిగత సమస్యలపై అభ్యంతరాలు తెలుపుతూ సభకు ఆటంకం కలిగించారు. దీంతో సజావుగా సాగుతున్న సమావేశం కాస్త రసాభాసగా మారింది. ఇంత జరుగుతున్న ఎంపీడీవో కిరణ్ మోహన్రావు చోద్యం చూస్తూ కూర్చోవడంపై పలువురు ప్రజా ప్రతినిధుల వద్ద గుసగుసలు వినిపించాయి. అనంతరం జాతీయ రహదారిపై అసంపూర్తిగా నిలిచిపోయిన విస్తరణ పనుల మీద ఉప్పరపల్లి ఎంపీటీసీ ఎర్రసాని నిరంజన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారి పీడీ పరిధిలో ఉన్నాయంటూ సమాధానం చెప్పడంతో అక్కడ ఉన్న మిగిలిన ప్రజా ప్రతినిధులు సైతం మండిపడ్డారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖల పనితీరు గురించి సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప మండల అధ్యక్షుడు ఆర్‌ఎస్ఆర్ (చిన్న) సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, డిప్యూటీ తాహసీల్దారు వెంకటరమణ, ఏఈలు మల్లికార్జున, మహేష్ ఏఓ శ్రీదేవి, ఎంఈఓ గంగిరెడ్డి, ఏపీఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగానికి అగ్రగామిగా వేంపల్లె



తాజ్ జ్యూవెలర్స్



సాయి బాలాజి ఫ్యాన్సీ స్టోర్

వేంపల్లె: విద, వైద్య, వ్యాపార రంగాలతో పాటు రోజురోజుకు అభివృద్ధి చెందుతుండటంతో వేంపల్లె పట్టణం వ్యాపార రంగానికి అగ్రగామిగా నిలుస్తోంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే రియల్ ఎస్టేట్‌తోపాటు బంగారం, ఎలక్ట్రికల్స్, ఫ్రాన్సీ స్టోర్స్, ప్రైవేట్ ఆస్పత్రులకు వేంపల్లె కేంద్రంగా నిలుస్తోంది.

ఆశాజనకంగా రియల్ ఎస్టేట్ రంగం

అన్ని జిల్లాలతో పోలిస్తే వేంపల్లె పట్టణంలో రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా ఉంది. కడప రోడ్డు, పులివెందుల రోడ్లలో టీచర్స్ కాలనీ, ఆదర్శ నగర్, జగతి హిల్స్ తదితర ప్రాంతాల్లో నూతన అపార్ట్‌మెంట్లు నిర్మాణంలో ఉన్నాయి. పలు వెంచర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కళకళలాడుతోంది. అంతేకాకుండా ప్రస్తుతం వేంపల్లె పట్టణంలో నాలుగు లేన్ల రోడ్లు, సెంటర్ లైటింగ్, రోడ్డుకిరువైపులా ఫుట్ పాత్‌లను ఏర్పాటు చేస్తుండటంతో పట్టణం మరింత విస్తరిస్తోంది. ఈ ప్రాంతాల్లో పలువురు బిల్డర్లు నూతన భవనాలు, డూప్లెక్స్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

బంగారు ఆభరణాల తయారీ

జిల్లాలోనే ప్రొద్దుటూరు తర్వాత బంగారు ఆభరణాల తయారీకి పెట్టింది పేరు వేంపల్లె. నిత్యం ఇక్కడ బంగారం విక్రయాలు కోట్ల రూపాయల్లో జరుగుతుంటాయి. అంతేకాకుండా పట్టణంలోని బంగారపు కోట్ల సెంటర్ అంటే జిల్లాలోనే వేంపల్లె ఎంతో ప్రసిద్ధి చెందింది. బంగారు ఆభరణాలు తయారు చేసే వారిలో అన్ని వర్గాల వారు ఉండటం మరో విశేషం. ఇక్కడి జ్యువెలరీ షాపులు ఉదయం నుంచి రాత్రి వరకు కస్టమర్లతో కళకళలాడుతుంటాయి.

విద్యారంగంలో ముందంజ

వేంపల్లి ప్రాంతం విద్యారంగంలోనూ ముందంజలో ఉంది. ముఖ్యంగా శ్రీచైతన్య, ఉషాకిరణ్, లిటిల్ ఫ్లవర్, శ్లోక ఇంగ్లీష్ మీడియం, స్వామి వివేకానంద, వికాస్, శ్రీనివాస హైస్కూల్ తదితర విద్యాలయాలతోపాటు సంసిద్ధ సతీష్ రెడ్డి హైస్కూలులో సింగపూర్ బేస్డ్ సిలబస్ ప్రాముఖ్యతను సంతరించుకోగా.. శ్రీ చైతన్య త్వరలో సెంట్రల్ సిలబస్‌కు పర్మిషన్‌ను అందుకుంది.

వస్త్ర దుకాణాలు

బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో ఉన్న పెద్ద, పెద్ద వస్త్ర దుకాణాలు వాటి షోరూంలను వేంపల్లెలో కూడా ఏర్పాటు చేశారు. వీణ క్లాత్, అమర్ క్లాత్ సెంటర్, ఏ వన్ డ్రెస్ మెటీరియల్, సురేష్ రెడీమేడ్, ప్రీతి శారీస్ సెంటర్ లాంటి షోరూంలతో పాటు పురుషులకు వస్త్రాలకు సంబంధించి అత్యుత్తమైన దుకాణాలుగా ఫ్యాషన్ హౌస్, ఫ్యాషన్ హోమ్, ఫ్రెండ్స్ షోరూం లాంటి దుకాణాలు వేంపల్లెలో అందుబాటులో ఉండటం గమనార్హం. అంతేకాకుండా ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి గోవిందస్వామి ఎలక్ట్రానిక్స్, సాయి బ్రాహ్మణి ఎలక్ట్రికల్, యస్దాన్ ఎలక్ట్రికల్స్ , పరమేశ్వర ఎలక్ట్రికల్స్, గౌస్ ఎలక్ట్రికల్స్ దుకాణాలు అందుబాటులో ఉన్నాయి. రిటైల్స్ మార్కెటింగ్ లో కూడా ఎంఆర్‌టీ, సూపర్ కే, స్టార్ వంటి స్మార్ట్ సూపర్ మార్కెట్లు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి.

వైద్య రంగంలోనూ..

వేంపల్లె పట్టణంలో ప్రజలతోపాటు గ్రామీణ ప్రజలకు కూడా కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యం అందుతోంది. అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యులు వారంలో ఒకరోజు ఇక్కడికి వస్తుంటారు. గండి రోడ్డులోని డాక్టర్ ఎస్.ఎఫ్ బాషా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులు, ఎముకలు, దంత వైద్యులు, గైనకాలజిస్టులు ప్రతివారం జిల్లా నుంచి డాక్టర్లు అందుబాటులో ఉంటారు. అయితే డాక్టర్ ఎస్.ఎఫ్ బాషా నలభై సంవత్సరాలుగా ఐదు రూపాలకే వైద్యాన్ని అందిస్తున్నారు.

ఫ్యాన్సీ స్టోర్స్ రంగాల్లో..

వేంపల్లె పట్టణంలో పదికి పైగా ఫ్యాన్సీ స్టోర్స్ ఉన్నాయి. ఫ్రాన్సీ స్టోర్లలో మహిళలకు, పురుషులకు సంబంధించి అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులకు సంబంధించి పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులతోపాటు విద్యాసామాగ్రి అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా దూర ప్రాంతాలకు వెళ్లకుండా పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు గిఫ్ట్ ఐటమ్స్ దొరుకుతాయి. ముఖ్యంగా సాయిబాలాజి ఫ్యాన్సీ స్టోర్, తిరుమల ఫ్యాన్సీ స్టోర్, మేడ ఫ్యాన్సీ స్టోర్లతోపాటు 10 దాకా ఫ్యాన్సీ స్టోర్లు ఉన్నాయి.